# ప్రకటన గ్రంథము 3వ అధ్యాయము

### సార్దీస్ సంఘమునకు వ్రాసిన లేఖ

"సార్దీస్‌లో ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము – ఏడు నక్షత్రములును దేవుని ఏడాత్మలును గలవాడు చెప్పు సంగతులేవనగా– నీ క్రియలను నేనెరుగుదును. ఏమనగా, జీవించు చున్నావన్న పేరు మాత్రమున్నది గాని నీవు మృతుడవే. 2 నీ క్రియలు నా దేవుని యెదుట సంపూర్ణమైనవిగా నాకు కనబడలేదు గనుక జాగరూకుడవై, చావనైయున్న మిగిలినవాటిని బలపరచుము. 3 నీవేలాగు ఉపదేశము పొందితివో ఏలాగు వింటివో జ్ఞాపకము చేసికొని దానిని గైకొనుచు మారుమనస్సు పొందుము. నీవు జాగరూకుడవై యుండనియెడల నేను దొంగ వలె వచ్చెదను. ఏ గడియను నీ మీదికి వచ్చెదనో నీకు తెలియనే తెలియదు. 4 అయితే తమ వస్త్రములను అపవిత్రపరచుకొనని కొందరు సార్దీస్‌లో నీయొద్ద ఉన్నారు. వారు అర్హులు గనుక తెల్లని వస్త్రములు ధరించుకొని నాతో కూడ సంచరించెదరు. 5 జయించువాడు ఆలాగు తెల్లని వస్త్రములు ధరించుకొనును జీవగ్రంథములోనుండి అతని పేరెంత మాత్రమును తుడుపు పెట్టక, నా తండ్రియెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందును. 6 సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాట చెవిగలవాడు వినును గాక.

### ఫిలదెల్ఫియ సంఘమునకు వ్రాసిన లేఖ

7 ఫిలదెల్ఫియలో ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము – దావీదు తాళపు చెవి కలిగి, ఎవడును వేయలేకుండ తీయువాడును, ఎవడును తీయలేకుండ వేయువాడునైన సత్య స్వరూపియగు పరిశుద్ధుడు చెప్పు సంగతులేవనగా 8 – నీ క్రియలను నేనెరుగుదును నీకు శక్తి కొంచెమై యుండినను నీవు నా వాక్యమును గైకొని నా నామము ఎరుగననలేదు. ఇదిగో తలుపు నీ యెదుట తీసియుంచి యున్నాను దానిని ఎవడును వేయనేరడు. 9 యూదులు కాకయే తాము యూదులమని అబద్ధమాడు సాతాను సమాజపు వారిని రప్పించెదను వారు వచ్చి నీ పాదముల యెదుట పడినమస్కారము చేసి, ఇదిగో, నేను నిన్ను ప్రేమించితినని తెలిసికొనునట్లు చేసెదను. 10 నీవు నా ఓర్పు విషయమైన వాక్యమును గైకొంటివి గనుక భూనివాసులను శోధించుటకు లోకమంతటి మీదికి రాబోవు శోధన కాలములో నేనును నిన్ను కాపాడెదను. 11 నేను త్వరగా వచ్చుచున్నాను. ఎవడును నీ కిరీటము నపహరింప కుండునట్లు నీకు కలిగిన దానిని గట్టిగా పట్టుకొనుము. 12 జయించువానిని నా దేవుని ఆలయములో ఒక స్తంభముగా చేసెదను అందులోనుండి వాడు ఇకమీదట ఎన్నటికిని వెలుపలికి పోడు. మరియు నా దేవుని పేరును, పరలోకములో నా దేవుని యొద్దనుండిదిగివచ్చుచున్న నూతనమైన యెరూషలేమను నా దేవుని పట్టణపు పేరును, నా క్రొత్త పేరును వానిమీద వ్రాసెదను. 13 సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాట చెవిగలవాడు వినును గాక.

### లవొదికయ సంఘమునకు వ్రాసిన లేఖ

14 లవొదికయలో ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము – ఆమేన్ అనువాడును నమ్మకమైన సత్యసాక్షియు దేవుని సృష్టికి ఆదియునైనవాడు చెప్పు సంగతులేవనగా 15 –నీ క్రియలను నేనెరుగుదును, నీవు చల్లగానైనను వెచ్చగానైనను లేవు నీవు చల్లగానైనను వెచ్చగానైనను ఉండిన మేలు. 16 నీవు వెచ్చగానైనను చల్లగానైనను ఉండక, నులివెచ్చనగా ఉన్నావు గనుక నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయ

నుద్దేశించుచున్నాను. 17 నీవు దౌర్భాగ్యుడవును దిక్కుమాలిన వాడవును దరిద్రుడవును గ్రుడ్డివాడవును
దిగంబరుడవునై యున్నావని యెరుగక – నేను ధనవంతుడను, ధనవృద్ధి చేసికొనియున్నాను, నాకేమియు
కొదువలేదని చెప్పుకొనుచున్నావు. 18 నీవు ధనవృద్ధి చేసికొనునట్లు అగ్నిలో పుటము వేయబడిన
బంగారమును, నీ దిసమొల సిగ్గు కనబడకుండునట్లు ధరించుకొనుటకు తెల్లని వస్త్రములను, నీకు దృష్టి
కలుగునట్లు నీ కన్నులకు కాటుకను నా యొద్ద కొనుమని నీకు బుద్ధి చెప్పుచున్నాను. 19 నేను
ప్రేమించువారినందరిని గద్దించి శిక్షించుచున్నాను 20 గనుక నీవు ఆసక్తి కలిగి మారుమనస్సు పొందుము.
21 ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపుతీసిన యెడల,
నేను అతనియొద్దకు వచ్చి అతనితో నేనును, నాతోకూడ అతడును భోజనము చేయుదుము. నేను జయించి నా
తండ్రితో కూడ ఆయన సింహాసనమునందు కూర్చుండియున్న ప్రకారము జయించువానిని నాతోకూడ నా
సింహాసనమునందు కూర్చుండ నిచ్చెదను. 22 సంఘములతో ఆత్మ చెప్పుచున్నమాట చెవిగలవాడు వినును
గాక.”